క్లుప్తంగా

రేపు 'హోయిహోయి బాలు పాట హోయి'

బోట్‌క్లబ్: కోన విజయభాస్కరరావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ 9 వ వార్షికోత్సవాన్ని స్థానిక సూర్యకళామందిరంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు బీవీఎస్ ప్రభాకర్, మార్ని జానకిరామ చౌదరి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగే సినీ సంగీత విభావరిలో గానగంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం చేసిన సుమధుర గీతాలను 'హోయిహోయి బాలు పాట హోయి' పేరుతో మాస్టర్ కాశీకృష్ణ సాయినాథ్ ఆధ్వర్యాన సంస్థ కళాకారులు ఆలపిస్తారన్నారు. సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వన్మణి పెద్దాడ సూర్యకుమారి దంపతులను సన్మానిస్తున్నట్లు చెప్పారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

కాకినాడ సిటీ: ఎస్‌బీఐ ఎస్‌యూఏసీ అసోసియేషన్ కాకినాడ రీజియన్ ఆధ్వర్యంలో తారక్‌నాథ్ 20వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వాటిలో భాగంగా రోటరీ క్లబ్ సహకారంతో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 40 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి వద్ద సుమారు 500 మందికి అన్నదానం చేశారు. అలాగే మండపేటలోని వృద్ధాశ్రమానికి అవసరమైన వస్తు సామగ్రిని అందించారు. కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ పేరి శాస్త్రి, రీజనల్ సెక్రటరీ లక్ష్మి, రామ్‌కుమార్, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామికి చక్రస్నానం



భీమేశ్వరస్వామి శ్రీపుష్ప యాగానికి ఏర్పాట్లు చేస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి చక్రస్నానాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి ఎంతో వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు కొడమంచిలి కార్తీక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఎటువంటి ఇబ్బందీ కలగకుండా ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం రాత్రి ఏడు గంటలకు స్వామి వారికి శ్రీపుష్పయాగం జరుగుతుందన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్ల ధర్నా

కాకినాడ సిటీ: రాజీనామాలు చేసిన తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద కాకినాడ సిటీ పరిధిలోని పలు డివిజన్లకు చెందిన వలంటీర్లు శుక్రవారం ధర్నా చేశారు. రాజీనామాలు చేసిన వలంటీర్లు అందరిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

భార్య విడాకులు ఇస్తానందని భర్త ఆత్మహత్య

కరప: భార్య విడాకులు ఇస్తానని చెప్పడంతో ఆమె భర్త మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. కరప మండలం నడకుదురు గ్రామానికి చెందిన మెక్కట్టుపరంబిల్ వర్గీస్ కుమారుడు ప్రసాద్ ఆంటోనికి తూరంగి గ్రామానికి చెందిన ప్రసన్నతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రసాద్ ఆంటోనీ తాగుడుకు అలవాటు పడి తరచుగా భార్యను వేధించేవాడు. ఆ వేధింపులు భరించలేక ఈనెల 19వ తేదీన ఇద్దరు పిల్లలతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. 20వ తేదీన ప్రసన్న తండ్రి నడకుదురులోని వియ్యంకుడికి ఫోన్ చేసి మీ అబ్బాయికి తన కుమార్తె విడాకులు ఇస్తానంటోందని చెప్పాడు. ప్రసాద్ ఆంటోనీ అదేరోజు రాత్రి 12 గంటలకు ఇంటికి రాగా తండ్రి జరిగిన విషయం చెప్పాడు. తర్వాత భోజనం చేసి పడుకున్నాడు. శుక్రవారం ఉదయం టిఫిన్ కోసం రమ్మన్నా, రానని తిరస్కరించాడు. మధ్యాహ్నం 12 గంటలకు కూడా బయటకు రాకపోవడంతో తండ్రికి అనుమానం వచ్చి తలుపులు తీయడంతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. దీంతో వర్గీస్ కరప పోలీసుస్టేషన్‌కు వచ్చి తన కుమారుడు ప్రసాద్ ఆంటోనీ ఉరివేసుకుని, చనిపోయాడంటూ ఫిర్యాదు చేశాడు. మృత దేహాన్ని పోస్టుమార్టమ్ కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



సూర్యారావుపేట బీచ్‌లో ఆసనాలు వేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు



పండూరు హైస్కూల్‌లో విద్యార్థుల విన్యాసాలు

యోగాతో జీవితం ఆరోగ్యవంతం

- జిల్లా జడ్జి కమలాదేవి

కాకినాడ లీగల్: శారీరకం, మానసిక, సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సులువైన సాధనమని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా బార్ అసోసియేషన్ హాలులో శుక్రవారం న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు యోగా చేశారు. ఈ సందర్భంగా కమలాదేవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి యోగా ఎంతో అవసరమన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు యోగా మెరుగైన సాధనమని, ఆ సాధన వల్ల మనసు, శరీరం తేలికవుతాయని, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత చేకూరతాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీ చక్కా శ్రీనివాస్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సర్వరోగ నివారిణి యోగా

బోట్‌క్లబ్: నిత్యం క్రమం తప్పకుండా యోగసనాలు వేయడం ద్వారా సర్వరోగాలు దూరమవుతాయని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర అన్నారు. స్థానిక గైగోలుపాడు రోడ్డులోని బీ స్ట్రాంగ్ ఫిటినెస్ సెంటర్‌లో శుక్రవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రాచీన భారతదేశంలో ఉద్భవించిన యోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసం అన్నారు. అసోసియేషన్ మాజీ అధ్యక్షులు అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ యోగాసనాలతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటామన్నారు. యోగా శిక్షకులు రాము, బీ స్ట్రాంగ్ ఫిట్‌నెస్ సెంటర్ అధినేత సంకీర్త్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ సౌత్ మండల అధ్యక్షులు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలో స్థానిక సంతచెరువు పార్కులో పార్టీ సీనియర్ నాయకుడు పైడా కృష్ణమోహన్ పాల్గొని మాట్లాడుతూ యోగా మానసిక, శారీరక ఒత్తిడిని తగ్గిస్తుందని అన్నారు. పార్టీ నాయకులు పెద్దిరెడ్డి రవికిరణ్, గొల్లపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

అమూల్యమైన సంప్రదాయం యోగా

కాకినాడ రూరల్: వెలకట్టలేని అమూల్యమైన పురాతన భారతీయ సంప్రదాయం యోగా అని, యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని యోగా గురువులు పేర్కొన్నారు. మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల యోగా ఆసనాలతో యువతకు అవగాహన కల్పించారు. సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్ కమాండర్ కల్నల్ సభ్యసాచి దాస్ ఆధ్వర్యంలో యోగా ఆసనాలు నిర్వహించారు. 18 ఆంధ్రా, 6 ఆంధ్రా బెటాలియన్, ఎన్‌సీసీ బెటాలియన్, 9 ఆంధ్రా బెటాలియన్, 3 ఆంధ్రా గరల్స్ బెటాలియన్ నుంచి సుమారు 450 మంది యోగా ఆసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాస్ మాట్లాడుతూ యోగా దినోత్సవాన్ని కాకినాడ పరిసరాలలో ఉన్న ఎన్‌సీసీ క్యాడెట్లతో ఎన్టీఆర్ బీచ్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. యోగాను ఆరోగ్య కోణంలోనే చూడకూడదని, ప్రతి రోజు అరగంట యోగ చేయడం ద్వారా జీవితాన్ని సమతుల్యం చేసుకోవచ్చని తెలిపారు.



సూర్యారావుపేట బీచ్‌లో ఆసనాలు వేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

నన్నయ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో..

తిమ్మాపురం గ్రామ పరిధిలోని అచ్చంపేట జంక్షన్ వద్ద ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యోగా గురువు మురళీకృష్ణ, ప్రొఫెసర్ ప్రశాంతి శ్రీ, ఉష కాంతి, క్యాంపస్ పీడీ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీదేవి, హరిబాబు, తదితరులు పాల్గొని యోగా ఆసనాలు వేశారు.

ఆకట్టుకున్న సూర్య నమస్కారాలు

మండలంలోని పండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సుమారు 350 మంది సూర్య నమస్కారాలలో పాల్గొన్నారు. హెచ్ఎం సూర్య ప్రకాశిని, ఎంవీవీ సత్యనారాయణ, బేగం, అంబటి శ్రీనివాస్, చక్రవర్తి, చౌదరి, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో..

రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జరిగిన యోగా దినోత్సవంలో యోగా గురువులు వేదుల శ్రీకృష్ణ ఫణీంద్ర, పార్థసారథిలను అడబాల రత్నప్రసాద్ తదితరులు ఘనంగా సన్మానించారు.



నన్నయ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో యోగాసనాలు..




యోగాసనాలు వేస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు



కరప హైస్కూలులో విద్యార్థులతో యోగా సాధన చేస్తున్న ఎంఈఓలు, నాయకులు

కరప మండలంలో..



నడకుదురులో అలయన్స్, ఆయుష్ ప్రతినిధుల యోగాసనాలు

కరప: మండల పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో, పలు గ్రామాల్లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.ప్రసాదకుమార్ అధ్యక్షతన ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, యోగా టీచర్ పెంకే లోవరాజు, పీడీ కె.శ్రీనివాసరావు విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. పెద్దాపురప్పాడులోని బిరుదా సూర్యనారాయణ (ఫకీ్రావు) జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎస్ఎస్ శ్రీనివాస్, యోగా గురువు తెలగాని వెంకట్రావు, పీడీ బీవీవీఎస్‌వీ ప్రసాద్ విద్యార్థులతో ఆసనాలు వేయించారు. నడకుదురులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ యోగా గురువు లోవరాజు, కాకినాడ అలయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అల్లె పెంకే గోవిందరాజు, అలయన్స్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు, స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ సంయుక్తంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, బీజేపీ నాయకులు పెండెం సత్యనారాయణ సుధాకర్, రెడ్డి రమణేశ్వర్, అల్లె మద్దావికాస్, కె.మెహర్‌శ్రీరాములు, కరప హైస్కూలు స్టాఫ్ సెక్రటరీ ఎం.రమేష్, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



యోగా గురువులను సన్మానిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

నీటి కాలుష్య కారక వ్యాధులను నిరోధించాలి



కరపలో గ్రామ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: గ్రామ పంచాయతీల పరిధిలో నీటి కాలుష్యం వల్ల వచ్చే అంటువ్యాధులను నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. కలెక్టర్ జె.నివాస్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వీవీఎస్ వర్ధన్, గ్రామ కార్యదర్శులతో సమావేశమై నీటికాలుష్య నివారణ చర్యలు, ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే తదితర అంశాలపై సమీక్షించారు. అనుసరించాల్సిన విధి విధానాలను వివరించి, అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం మంచినీటి ట్యాంక్‌లను శుభ్రపరచాలన్నారు. ట్యాంక్ నిండిన వెంటనే తగిన మోతాదులో బ్లీచింగ్ కలిపి క్లోరినేషన్ చేయాలన్నారు. ట్యాంక్‌ల మూతలు, మంచినీటి ట్యాంక్ పైకి ఎక్కే, లోపలకు దిగే మెట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే 15వ ఆర్థికసంఘం నిధులు వినియోగించాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఒక జట్టుగా ఏర్పడి ప్రతిరోజూ ఆయా పంచాయతీల పరిధిలోని వీధులను సందర్శించి మంచి నీటి పైపులైన్‌లో, వీధి కుళాయిల వద్ద లీకేజీలు లేకుండా తగిన చర్యలు తీసుకోవడంద్వారా నీటి కాలుష్యాన్ని నిరోధించాలని ఎంపీడీఓ సూచించారు. ప్రతి గ్రామంలో సచివాలయ సిబ్బందితో కల్సి గ్రామకార్యదర్శి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను సందర్శించి తాగునీటి వనరుల వద్ద కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ స్థాయిలో నీరు, పారిశుధ్య కమిటీ సమావేశాన్ని ఏర్పాటుచేసి నీటికాలుష్యం ద్వారా కానీ, సీజనల్ మార్పువల్ల కానీ వచ్చే వ్యాధులను నియంత్రించేందుకు కమిటీ పర్యవేక్షించాలన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి తనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వర్ధన్ రోజుకొక గ్రామంలో పర్యటించి పంచాయతీల పనితీరును పర్యవేక్షించనున్నారని ఎంపీడీఓ తెలిపారు.

పిల్లలు పాఠశాలలోనే ఉండాలి

- వలస గుడారాల వద్ద 'నేను బడికి పోతా' కార్యక్రమం
- తల్లిదండ్రులకు అవగాహన కల్పించిన జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్

కాకినాడ రూరల్: స్థానిక కొత్తూరు జంక్షన్‌లోని వలస కుటుంబాల గుడారాల వద్ద 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. బడి ఈడు పిల్లలు, బడి బయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి పి.రమేష్ నిర్వహించారు. ఐదేళ్ల లోపు పిల్లలను ప్రీ స్కూల్లో నమోదు చేయాలని, అలాగే 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతులను, నాణ్యమైన విద్యను ఉచిత పాఠ్య పుస్తకాలను స్టూడెంట్ కిట్లను అందిపుచ్చుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు

అలాగే నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుంచి జూలై 12 వరకు జిల్లాలో అన్ని గ్రామాల్లోని ఆవాస ప్రాంతాల్లో అన్ని మండలాల్లో మండల విద్యాశాఖ అధికారుల ద్వారా ఉపాధ్యాయుల ద్వారా సమన్వయం చేసి నిర్వహిస్తామన్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు ఉన్న ఏడుగురు బడి బయట పిల్లలను సమీప పాఠశాలలో చేర్చారు. మిగిలిన ఐదేళ్ల లోపు పిల్లలను ఐసీడీఎస్ ద్వారా అంగన్వాడీ కేంద్రంలో చేర్పించారు. కార్యక్రమంలో డీసీపీవో వెంకట్, జిల్లా ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్, సమగ్ర శిక్ష కె.హరికృష్ణ, పీఓ ఐసీ కె.శ్రీనివాసరావు, పీఓ ఎస్‌ఐసీ జె.విజయ, మండల విద్యాశాఖ అధికారులు వేణుగోపాల్, వై.ఏసుదాసు ఉపాధ్యాయులు రాధా మాధురి, శ్రీనివాసు నూకరాజు, సీఆర్పీలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వలస కార్మికులు, వారి పిల్లలకు అవగాహన కల్పిస్తున్న రమేష్, అధికారులు



గొడ్డటిపాలెంలో చిన్నారి తండ్రితో దరఖాస్తుపై సంతకం చేయిస్తున్న ఎంఈఓలు, సర్పంచ్

గొడ్డటిపాలెంలో..

కరప: మండలం గొడ్డటిపాలెంలో శుక్రవాకం విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ, సర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, సీఆర్పీలు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలసి విద్య వల్ల కలిగే ప్రయోజనాలు వివరించి, ఐదేళ్లు నిండినవారిని బడిలో చేర్పించాలన్నారు. తల్లిదండ్రులను ఒప్పించి దరఖాస్తు ఫారాలపై సంతకాలు తీసుకున్నారు. జూలై 12వ తేదీ వరకు ప్రతి గ్రామంలో తిరుగుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంఈఓలు తెలిపారు.

రైతుబజార్‌లో సమస్యలు పరిష్కరిస్తాం

- కమిషనర్ వెంకటరావు
- వర్తక సంఘం ప్రతినిధులు, వ్యాపారులు మార్కెటింగ్ అధికారులతో సమావేశం

కాకినాడ: కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని రైతుబజార్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం రైతుబజార్ వర్తక సంఘ ప్రతినిధులు, వ్యాపారులు, మార్కెటింగ్‌శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రైతుబజార్ ప్రాంగణంలో డ్రైనేజీలపై ఏర్పాటు చేసిన శ్లాబ్‌లను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. అక్కడి డ్రైన్లను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే రైతుబజార్‌లో నిత్యం ఉత్పత్తి అయ్యే చెత్తను ఎవరికివారే డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆ వ్యర్థాలను నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పెద్దబిన్‌లో వేసేలా సహకరిస్తే అక్కడి నుంచి తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే కూరగాయల వ్యర్థాలను ఎస్‌పీసీఏకు తరలించేలా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుబజార్ వర్తకులు సహకరించి కొనుగోలుదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని నగరపాలక సంస్థ తరపున తమ వంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎస్ఈ సత్యకుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాము, ఏఈ రమేష్, మార్కెటింగ్ అధికారులు, రైతు బజార్ మార్కెటింగ్ అధికారులు, ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

టౌన్‌హాల్‌లో పైడా సమావేశ మందిరం ప్రారంభం

బోట్‌క్లబ్: టౌన్ హాల్ ప్రాంగణంలో పైడా కుటుంబ సభ్యులు నిర్మించిన సమావేశ మందిరాన్ని శుక్రవారం కమిటీ చైర్మన్ జి.సత్యనారాయణమూర్తి, కార్యదర్శి పాబోలు చిన్న పున్నయ్య సంయుక్తంగా ప్రారంభించారు. రూ.35 లక్షలతో పైడా వెంకట నారాయణ బ్లాక్ పేరిట ఈ మందిరాన్ని నిర్మించారు. పున్నయ్య మాట్లాడుతూ లిటరరీ అసోసియేషన్ పేరిట నిర్వహిస్తున్న టౌన్‌హాల్ ప్రాంగణంలో సభలు సమావేశాలు నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేక హాల్ నిర్మించినట్టు తెలిపారు. సభ్యులతో పాటు నగర ప్రజలు ఈ మందిరం సేవలను వినియోగించుకోవచ్చని వివరించారు. ఘన చరిత్ర కలిగిన టౌన్ హాల్ కమిటీ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు క్రీడా, విద్య, వైద్య ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. సమావేశ మందిరాన్ని ఇంత అందంగా తీర్చి దిద్దిన అడపా వాసుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జి.వై.రఘునాథ్, కోశాధికారి ఎం.సూర్యనారాయణ రాజు, కమిటీ సభ్యులు ఎస్‌జీఆర్ సుబ్రహ్మణ్యం, బచ్చు శివప్రసాద్, బసవ ప్రసాద్, బచ్చు శేఖర్, ఎం సత్యనారాయణ, దంగేటి ప్రసాద్, పైడా కుటుంబ సభ్యులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



సమావేశ మందిరాన్ని ప్రారంభిస్తున్న టౌన్‌హాల్ కమిటీ చైర్మన్ నానాజీ

సంగీతాన్ని భావి తరాలకు అందించాలి


- సంగీత విద్వాంసురాలు చావలి సూర్యకుమారి

కాకినాడ రూరల్: భారతీయ సంగీతానికి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక స్థానం ఉందని తల్లిదండ్రులు తమ పిల్లలకు సంగీతాన్ని నేర్పించి భావి తరానికి అందించాలని సంగీత విద్వాంసురాలు చావలి సూర్యకుమారి పేర్కొన్నారు. ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సూర్యకుమారి, మరో సంగీత విద్వాంసురాలు దుర్గామహాలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగీతంతో మనసుకు సాంత్వన చేకూరుతుందని, సంగీత సాధనతో క్రమ శిక్షణతో పాటు మానసిక ప్రశాంతత ఏర్పడుతుందన్నారు. దుర్గా మహాలక్ష్మి మాట్లాడుతూ సంగీతం నేర్చుకోవడానికి వయసు తారతమ్యం లేదన్నారు. సంగీత సాధనతో దీర్ఘ కాలిక రోగాలు కూడా నయమవుతాయన్నారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్, రెడ్నం రాజా, చింతపల్లి సుబ్బారావు, శ్రీనగేష్, కొమ్మూరి శ్రీనివాసరావు, పి.పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.



సంగీత విద్వాంసులు సూర్యకుమారి, దుర్గామహాలక్ష్మిలను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బాలాత్రిపుర సుందరి ఆలయ ప్రాంగణంలో నాటేందుకు మొక్కలను తీసుకువెళ్తున్న ఈఓ తదితరులు

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈఓ చింతపల్లి విజయభాస్కర రెడ్డి అన్నారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో శుక్రవారం ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పలు మొక్కలను నాటారు. దేవదాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు ఆలయంతో పాటు ఆలయ పరిసరాల్లో మొక్కలు నాటామన్నారు. ఆలయంలోని సరస్వతి నందనవనం, అమ్మవారి కోనేరు పరిసర ప్రాంతాల్లో మారేడు, జమ్మి, పారిజాతం, కదంబం, వేప, తులసి, మేడి, ఉసిరి మామిడి వంటి వివిధ రకాల దేవతా వృక్షజాతులను నాటారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం, ఆదిత్య శర్మ, కనకదుర్గ, ఎస్.జగ్గారావు, బోడ ఆనందకుమార్ పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

సామర్లకోట: చర్చల పేరుతో కాలయాపన మాని రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. గత 11 రోజులుగా సాగుతున్న ఆందోళనలో భాగంగా రాక్ సిరామిక్స్ కార్మికులు శుక్రవారం ఆ సంస్థ గేటు ఎదుట బైఠాయించారు. క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాక్ సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులను తొలగించి 66 రోజులు గడిచిందన్నారు. శాంతి యుతంగా ఆందోళన చేస్తూ ఉంటే రోడ్డుపై బైఠాయించడానికి వీలులేదని యాజమాన్యం కార్మికులను బెదిరించడం సరికాదన్నారు. అధికారులు జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులను ఎందుకు తొలగించారో వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

ఈ చెట్టును తొలగించరూ..

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం గ్రామంలో ఈనెల 16న వీచిన బలమైన గాలులకు పూల మార్కెట్ వెనక ప్రభాకర్ కోటా వీధిలో చెట్టు నిర్మాణంలో ఉన్న ఇల్లు, విద్యుత్ తీగలపై వాలిపోయింది. ప్రమాదభరితంగా ఉన్న చెట్టు రెమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది తొలగించినప్పటికీ చెట్టును అలానే వదిలేశారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉన్న చెట్టును గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



సర్పవరంలో ప్రమాదభరితంగా ఉన్న వేప చెట్టు